

# అద్దం

పి. యస్. నారాయణ

**బాలానగర్ లో** బస్సుదిగి కూకట్‌పల్లినుంచి వచ్చే బస్సు ఒకటి కోసం ఎదురుచూస్తున్నాను. సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్ళాలి. ఆపైన అక్కడి నుంచి రావ్‌నగర్ గుండుకు వెళితే శారద కనబడుతుంది. ఆవిడగారితో ఒక పావు గంట మాట్లాడి, కాదూ కూడదంటే భోజనం చేసి హోటల్‌కి వెళితే తెల్లవారు ఝామునే లేచి ఏడు గంటలకల్లా కృష్ణలో కూర్చుని మధ్యాహ్నానికి గుంటూరు చేరవచ్చు.

అప్పుడే గుంటూరు నుంచి వచ్చి మూడు రోజులు అయింది, ఆఫీసు పనిమీద. ఆఫీసు పనయితే అయిపోయిందికాని, నేను చూడవలసిన బంధువులు, స్నేహితులు ఇంకా పూర్తికాలేదు.

బస్సు రాలేదు. పైనుంచి సాయంత్రం అయిదు గంటలకే నవంబర్ మంచు తెగ కురుస్తున్నది. ఐ.డి.పి.ఎల్. కాలనీలో సత్యాన్ని చూద్దామని వెళితే ఇదీ బస్సులతో బాధ. వాడూ వస్తానన్నాడు బాలానగర్ దాకా. అసలే ఆస్త్మా పేషెంటు. పట్టపగలే స్వెట్టరేసుకుని, నెత్తికి మఫ్లర్ చుట్టుకుని మూల గదిలో ముక్కుతూ మూలుగుతూ కూర్చుంటాడు. వాడువచ్చి నన్నెక్కడెక్కిస్తాడు బస్సు! అయినా హైద్రాబాద్‌కు నేను కొత్తే అవ్వవచ్చుగాని చిన్న పిల్లవాడిని కాదుగదా!

"హలో, రామం!" ఉలిక్కిపడి ఆ కేక వచ్చిన వైపుకు తల తిప్పాను. విచిత్రంగా నన్ను రామం అని అంత చనువుగా పిలిచే ఆ ఆడ కంఠం ఎవ్వరిదా అన్నట్లు.

శారద!

"హాయ్, శారదా! ఏమిటి ఇక్కడ ఉన్నావ్?"

"ఎస్, ప్లీజ్... ఉన్నాను ఇక్కడే!" అన్నది నవ్వు

తూకళ్ళు మూసి, తెరిచి పళ్ళు మరీ బయట పెట్టి.

"నువ్వెప్పుడు వచ్చావ్ గుంటూరు నుంచి? అయినా నేనీ వూర్లో ఉన్నాననే విషయం నీకు తెలుసా, తెలియదా?"

"నేను వచ్చి మూడు రోజులు అయింది. ఇప్పుడు బయల్దేరు తున్నది నీ దగ్గరికే!"

"సిగ్గు లేదూ అలా చెప్పుకోవటానికి!" సీరియస్‌గా ముఖం పెట్టి అన్నది.

"నిజం చెప్పేటప్పుడు సిగ్గెందుకు పడాలి?"

"ఏ సీ!" పెదిమలు బిగించి మరీ నన్ను పరీక్షగా చూస్తూ అన్నది.

"ఇటు ఎందుకొచ్చావ్?"

"సత్యం దగ్గరకు. నీకు తెలుసుగదా వాడు!"

"సన్నటి. . .పొడుగాటి... కథలు రాసే పెద్ద మనిషేనా!"

"అహా. అతగాడే!"

"ఇక్కడే ఉంటున్నాడా?"

"సంవత్సరం అయింది. నువ్వు మీ ఆయనతో హైదరాబాద్‌కు వచ్చిన ఆర్నెల్లకు వాడు వచ్చాడు!"

చటుక్కున నాదగ్గరకు రెండడుగులు వేసింది.

"నేను ఆయన దగ్గర ఇప్పుడు ఉండటంలేదు. ఆ విషయం నీకు తెలుసా?"

అదిరి పడటం నా వంతయింది!

శారద మా ఇంగ్లీషు మాస్టారమ్మాయి. మా పక్కింట్లోనే ఉండేవారు. నాకు స్కూల్లో ఇంగ్లీషే కాదు, ఇంటి దగ్గర అన్ని సబ్జక్ట్స్ ప్రయివేటు కూడా చెప్పేవాడు ఆయన.

చిన్నప్పటి నుంచీ పక్క పక్క ఇళ్ళలో ఉండడంతో ఆత్మీయంగా ఉండే వాళ్ళం.

"అదేం" అన్నాను వింతగా శారద ముఖంలోకి చూస్తూ.

"ఇంటికి వెళ్దాం, పద."

"పద—అవునూ అసలు ఇటెందుకు వచ్చావ్ నువ్వు?"

"ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాను గనుక."

మరో సారి తడబడటం నావంతే అయింది.

"ఇవన్నీ మాస్టారుకు తెలియవా?. . . తెలిసే నాకు కావాలని చెప్పకుండా దాచి పెట్టారా?"

"ఏమిటిఅలా బిక్కముఖంవేసుకు చూస్తున్నావ్? బస్సు వచ్చింది...ఎక్కెక్కు" అన్నది.

ఎక్కాను ఉలిక్కిపడి. జనం అంతగా లేరు. సీటు కోసం చూస్తుంటే ముందుగా ముందు ఎంచి ఎక్కిన శారద "రామం. . .ఇటు" అన్నది. కాస్త తటపటాయించినా వెళ్ళి పక్కన కూర్చున్నాను.

"ఏం చేస్తున్నావు ఇక్కడ?"

"ఆ కంపెనీలో రిసెప్షనిస్టుగా!"

"ఏం కంపెనీ అది!"

"బోడి కంపెనీ. ఏదయితేనేం? ఒక కంపెనీ!"

నేను నవ్వేసి వూరు కున్నాను.

"అంటే, హీరోయిన్‌వి అయిపోయావన్నమాట"

"మీ మగవాళ్ళంతా హీరోలవుతున్నంత కాలం మేం హీరోయిన్లవ్వక తప్పదు. .. నేను మాత్రం మీలాగా మనిషిగా పుట్టలేదా. నాకు మాత్రం ఏం తక్కువ అయిందని!" చిన్నగా నాకు మాత్రమే వినబడేటట్లుగా అన్నది.

శారద సంగతి నాకు తెలుసు. . . మహా మొండి మనిషి!

కథంతా తెలుసుకుంటేనేగాని అసలు సంగతి అర్థం కాదు. నా బాధంతా మేస్టారికి ఈ వయస్సులో మనస్తాపం కలిగించే విషయమే ఇది. ఒక్కగానొక్క కూతురు. . చక్కగా మొగుడితో కాపురం చేస్తుంటే అదో అందం. . .

కండక్టరు వచ్చాడు. నేను టిక్కెట్లు తీసుకోబోతుంటే, "నాకు పాసున్నది. ఒక్కటే తీసుకో!" అన్నది శారద.

"ఎక్కడికి తీసుకో మంటావు!"

"ముందు స్టేషన్‌కి. . .అప్పైన చిక్కడపల్లికి."

"చిత్తం!"

బస్సు మెల్లగా జనంలో నుంచి ఈదుకుంటూ వెళుతూంది. వూరి బయట గూడా ఇన్ని కార్లు, ఇంత జనమేమిటి?

"నీ పెళ్ళెప్పుడేం?" అన్నది నా వంక వోరగా చూస్తూ శారద.

"పెళ్ళి చేసుకున్న నువ్వు ఇంతగా సుఖపడుతున్నావుగదా. నా పెళ్ళి గురించి అంత ఆదుర్దా దేనికి?" అన్నాను బాధగా.

ఫక్కున నవ్వేసి, "లాయర్ను చూడవోయ్, రామం. డైవర్స్ ఇచ్చేస్తాను!" అన్నది.




ప్రతి బినాకా ఫ్లోరైడ్ 125 గ్రా.
మరియు 200 గ్రా. ప్యాక్ లోపల.

బినాకా ఫ్లోరైడ్

అగ్రశ్రేణికి చెందిన భారతదేశపు, ప్రభావంగల మొట్టమొదటి టూత్‌పేస్ట్.

ఈ కానుక ఎన్నిక చేసిన పట్టణాల్లో, సరుకు ఉండేదాకానే.

ULKA-BFS-1-82 TEL

29—9—82

"చస్తే నే నా పని చేయను!"

"చస్తే ఎలాగూ అలాంటి పని చేయలేవు అనుకో. కాని ఒక్కటి గుర్తుంచుకో, రామం. ఈ భూమిమీద సగం మంది జనం బోడి సెంటిమెంట్లతో చచ్చి పోతున్నారు. లేకపోతే వెధవది రెండు నెలలు చిన్నని నీకు నేను దూరమయి పోయానా అంటే... పూర్ గాళ్... ఈ శారద ఒట్టి దురదృష్టవంతురాలన్న మాట!"

మొట్టమొదటి సారిగా నా గుండెలో బాంబు పేలినట్లు అనిపించింది!

కాలుతూన్న పెనం మీద కూర్చున్నట్లు అనిపించగా కొద్దిగా పక్కకు జరిగాను.

పసిగట్టేసింది శారద. చురకత్తిలాంటిది బుర్ర!

"భయపడ్డావు గదూ!" అన్నది ఫక్కున నవ్వి.

శారదతో పరిచయమైనప్పుడే తెలుసు, నాకంటే ఆమె పెద్దదని. నేను కలలో గూడా ఆమెను ఆ దృష్టితో చూడలేదు!

ఇష్టానికి నిర్వచనం అదొక్కటేగాదు. మేం ఇద్దరం మిత్రులం. గాఢ మిత్రులం. అత్యంత ఆత్మమిత్రులం. అంతే!

దూరంగా విమానం పెద్ద శబ్దంతో క్రిందకు వచ్చేస్తూంది.

"ఎన్నాళ్ళయిందేం విడిగా వచ్చేసి?"

"నెలా...రెండు నెలలు...ఆరు నెలలు..పీరియడ్‌ను బట్టి డోసు మారుద్దాం అనుకుంటున్నావా? అవునూ—హోమియో పుస్తకాలు ఇంకా చదువుతూనే ఉన్నావా?" మాట మార్చటంలో ఆవిడకు ఆవిడేసాటి!

"తల తిక్కగా మాట్లాడబోకు. నా కోపం సంగతి నీకు తెలుసు గదా!"

"నాకు గుర్తున్నంత వరకూ నీ కోపం ఎప్పుడూ నా పట్టుదల ముందు పీగిపోతూనే ఉన్నది!"

నిజమే.

చెప్పాలంటే ఒక్కసారి గాదు... చాలాసార్లు ఆమె ముందు నేను వోడిపోయాను— అది అక్షరాలా నిజం.

స్టేషన్‌కువచ్చేటంత వరకూ ఇద్దరికీ మాటల్లేవు. బొమ్మల్లా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు బిగుసుకు పోయి కూర్చున్నాం...

బస్సు దిగిన తర్వాత, "ఐస్‌క్రీమ్ తిందాం" అన్నాను.

"అంతగా కోపంతో మండిపోతున్నదా శరీరం"

జాలిగా చూచి నవ్వాను.

"శారదా! ఈనాడు నాకెంత దురదృష్టకరమైన రోజో తెలుసా!" కనుపాపల్ని తడి పొరలు కప్పేస్తున్నాయి.


"కాని నాకెంత సుదినమో ఈ రోజు!" అన్నది మూతి బిగించి. వెక్కిరిస్తున్నట్లుగా కనురెప్ప లెగరేసింది. "నా మనస్సునంతా పరిచి ముందుంచేందుకు ఒక ఆత్మీయుణ్ణి నేను కలుసుకోగలిగాను!"

"మంచి కాఫీ తాగుదాం, పద!"

"ఇంటికి వెళితే హోటల్లో బోడి కాఫీకంటే మంచి కాఫీనే దొరుకుతుంది!"

"సరే పద— నా మాట ఏది నెగ్గింది కనుక!"

తల ఎగరవేసి ఫక్కున నవ్వింది. "మిష్టర్ రామం!




నా పేరు శారద! అవునా... ఏయ్, ఆటో...చిక్కడపల్లి!" చటుక్కున ఎక్కి కూర్చున్నది. నేనూ ఎక్కాను.

మళ్ళీ మాటలు శూన్యం—బస్సుకు పోనున్నా ఆటో ఎక్కిందీ అంటే శారద ఎంత అర్థంగాని మనిషో చెప్పక చెబుతూంది.

పది నిమిషాల తరువాత ఆటో ఆగింది. నేనే డబ్బులిచ్చాను శారద వద్దంటున్నా. గేటు తీసుకుని లోపలకు వెళ్ళాం. తలుపుకు వేసిన తాళం తీసింది. తలుపు తీసి పక్కన నిలబడి 'రా' అన్నది. నేను లోపల అడుగు వేయటం ఆలస్యం తలుపువేసి, ఆ తలుపునే ఆనుకొని కళ్ళు మూసుకున్నది. ఆపైన నేను ఉలిక్కి పడేలా భోరున ఏడవ సాగింది. "రామం... రామం." పెదిమల మీద, పంటి మీద కొరుక్కుంటుండగా రక్తం బొట్లు బొట్లుగా కారసాగింది.

శారదను అర్థం చేసుకోవటం ఆమెను పుట్టించిన ఆ బ్రహ్మకు కూడా తరంగాదు.

• • • •

రాత్రి పదయింది.

అప్పుడే ఎదురుగా ఉన్న హోటల్లో భోజనం చేసి, ఇంటికి వచ్చాం. వంట చేస్తానంటే నేనే వద్దన్నాను. 'వంట చేస్తూ టైమ్ వేస్ట్ చేసే దాని కంటే ఎదురుగ్గా కూర్చుని కబుర్లు చెప్పు' అని సలహా ఇచ్చాను.

"ఎన్నాళ్ళుంటావు ఇక్కడ?"

"రేపు ఉదయాన కృష్ణాకే."

"ఐ సీ... ఆ టిక్కెట్టు ఇలా ఇవ్వు. చూద్దాం. నిజమేనా నువ్వు చెబుతున్నది అన్నది టీ పెచ్చు బెడుతూ, ఇంట్లో కాలు పెట్టిన అరగంటకు.

"నిజం. చూడు!" అన్నాను టిక్కెట్టు ఇస్తూ.

ఫక్కున నవ్వింది, నన్ను తికమక చేస్తూ. "రేపు మానేయ్!" అన్నది. "నాకోసరం"

"ఉఁహూఁ!.. రేపు ఆఫీసులో పనుంది. వెళ్ళి తీరాలి."

"సరే. అలాగే. ఏం చేస్తాం!" అంటూనే టిక్కెట్టును స్టౌ మీద మంటలో పడేసి, "ఇక ఎవ్వడికి చెప్పుకుంటావో చెప్పుకో. టిక్కెట్టు పోయిందని ఏడ్వబోకు. నా పర్సులో డబ్బులు ఉన్నాయి. తీసుకో!" అన్నది.

"శారదా!" అన్నాను ఆవేశంగా.

"రామం! శారద నిన్ను రెండు రోజులుండమని ప్రార్థిస్తూంది. నాకూ సెలవు దొరకటం కష్టం. అయినా ఈ రెండు రోజులూ వాళ్ళు సెలవు ఇవ్వక పోతే ఉద్యోగం మానేసైనా ఉంటాను— తెలుసా!"

ఇంకేం మాట్లాడాలి నేను?

"కుర్చీలు వాకిట్లో పడేయమంటావా? కాదంటే మేడమీద చాప వేసుకుని కూర్చుందాం!"

పైకి వెళ్ళాం. వెన్నెల తెల్లగా మెరిసి పోతూంది. నేలంతా మంచుతో తడిసి చల్లగా ఉన్నది. పక్కనే రోడ్డు మీద జన సందోహం. వాహనాల సందడి. హారన్ల మోత.

చాప నేల మీద వేస్తూ, "రేపొద్దున్నే నువ్వు ఒక్కసారి శేఖరం దగ్గరకు వెళ్ళి రావాలి. ఒక చిన్న ఉత్తరం వ్రాసి ఇస్తాను. ఆయనకు చూపించి సమాధానం తీసుకురావాలి— ఇక్కడ బాగా చల్లగా ఉన్నది గదా!" అన్నది.

"ఏమిటా ఉత్తరం!"

"చదివాకు మొగుడూ పెళ్ళాల మధ్య లక్ష ఉంటాయి..." అన్నది నవ్వి.

"విడాకులు ఇస్తానంటుంటివి గదా ఒక పక్కన!"

"దేని కదే... ఆయన్ని తిడుతూ నేనేదో రాస్తాను. నన్ను తిడుతూ ఆయనేదో రాస్తాడు. చదివావో నీ తల వంద వ్రక్కలవుతుంది. నా శాపం అది!" అన్నది మరోసారి ఫక్కున నవ్వి.

"అసలు విడిపోయేటికి కారణ మేమిటో ముందు చెప్పు— అది కావాలి!"

"ఏమ్మర్ని కలపాలనే బోడి ఆలోచనలేవీ లేవు గదా నీ బుర్రలో!"

నా మనస్సులోరి అదే అయినా, ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

"నా నాన్నకు ఉత్తరం వ్రాయమంటావా?"


"నన్ను హుస్సేన్ సాగర్‌లో దూకమంటావా?" అన్నది కోపంగా నావంక చూస్తూ.

ఆవిడగారిని మాటలతో జయించడం మహా కష్టం!

"భర్తను వదిలేసిన ఆడదానికి హుస్సేన్ సాగర్ అయినా ఒకటే, చార్మినార్ అయినా ఒకటే!" అన్నాను కవ్వింపుగా. "కాదా!"

"మీ బంధు వొకడు కన్నిగాడని ఉండాలి— పెద్ద వీటగడూ— ఇంకా అలాగే ఉన్నాడా?"

"వాడికేం నిత్య కల్యాణం పచ్చతోరణం. వాడి అన్న రంగనాథం గూడా వాడితో కలిశాడు. ఇద్దరూ కలిసి ఒనాన్ని మంచేస్తున్నారు. వాళ్ళ కథలు కావాలంటే సత్యంతో చెప్పి అన్ని పత్రికల్లోనూ ధాయిస్తాను గాని, మాట మార్చబోకు. నీ సంగతి




చెప్పు. నీకూ, మీ ఆయనకూ పేచీ ఎందుకు వచ్చింది? ఎందుకు విడిపోవాలనుకుంటున్నారు?... ఆయన ఎవర్నైనా ప్రేమించాడా? నువ్వు మరెవరినైనా పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నావా? మీ ఇద్దరి మధ్య అగ్గి పుల్లలు ఎలా వెలిగించ బడినాయి? సావకాశంగా కూర్చుని అన్నీ చెప్పక పోయినావో నీ తల వందకాదు వెయ్యి ముక్కలయి..."

"ఆపు... ఆపు! ఆకాశం వైపుకు ఒక్కసారి చూడు. ఆ పైన తడిసిన నెలవంక చూడు. మరో మాట మాట్లాడకుండా చాపమీద కూర్చో!"

"వూఁ. కూర్చున్నాను. చెప్పు."

"శేఖరాన్ని అడగరాదూ—రేపొద్దున వెళ్తున్నావు కదా! ఆయన చెప్పిందంతా విని నాకు చెప్పు. ఆయన చెప్పిందాంట్లో నిజమున్నదో, లేదో నేను చెబుతాను!"

• • • •

తెల్లవారు ఝామున అయిదు గంటలకు కాబోలు లేపింది. "వీధి చివర్లో పాలబూతుంది. కార్డు చూపించి ఒక ప్యాకెట్టు పట్టుకురా. ఆ కుర్రాడు తెచ్చేందాకా కూర్చుంటే ఇంకో గంట పడుతుంది. కనుక తెచ్చి ముఖం కడుక్కుంటే కాఫీ కలుపుతాను. త్రాగుదువుగాని!"

"శేఖరం దగ్గరకు అంత పెందరాళే వెళ్ళాలా?"

మూతిని సున్నాలా చుట్టే నా ముఖంవంకే చూస్తూ నిల్చున్నది ఎగతాళిగా అన్నానని హర్టయినట్లున్నది.

"సారీ!"

"నో . . .దేనికి సారీ!"

కాస్త తడబడ్డాను.

"అది కాదుగని, శారదా! సహోజే ఇప్పుడు కాళ్ళకు పసుపు రాసుకుని, పట్టు చీర కట్టుకుని, చేత పూల బుట్ట పట్టుకని, శేఖరం మాస్టారు దగ్గరకు సరాసరి వెళ్ళి—"

"అది అయ్యే పని కాదు. నువ్వు పాలు తీసుకురా ముందు వెళ్ళి."

పావు గంటలోనే కాఫీ తాగుతూ కూర్చున్నాను. "శేఖరాన్ని పిల్చుకు రమ్మంటావా?"

"దాని వలన లాభం!"

"పోనీయ్. . . నష్టమేదైనా ఉన్నదంటావా?"

ఒక్క క్షణం తల గోక్కుని "నన్ను అవమానిస్తే నీకు ఆనందంగా ఉంటుందా!" అన్నది.

గుడ్డలు మార్చుకుని ఆమె రాసిచ్చిన కాగితం జేబులో వేసుకుని బయటకు వచ్చేశాను గంట తరువాత.

ఇంతకీ ఆ చీటీలో ఏం రాసింది? చూస్తేనో ... తల వెయ్యి వ్రక్కలవుతుందనే శాపం నెత్తి మీద కత్తిలా గిరగిరా తిరుగుతూంది!

ఇంకా రోడ్ల మీద మంచు కురుస్తూనే ఉన్నది. రోడ్లన్నీ చెత్తా చెదారంతో అసహ్యంగా ఉన్నాయి.

చీటీలో—రాక్షసుడి ప్రాణం చిలక కంఠంలో ఉన్నట్లుగా— వాళ్ళ మనస్సులు విరిగి పోయిన కారణం ఆ చీటీలో ఉన్నది. చూస్తేనో?

చూసి— వాళ్ళకు తిరిగి నా ముఖం చూపగలనా?

అడ్రను... అస్పైన గుర్తులు...కాగితం మీద రోడ్ల గీసి, ఇంటి నంబర్లు వేసి మరీ చెప్పింది.

బస్సు ఎక్కితే చల్లటి గాలి ఈదురో మంటూంది. అందునా ఆ సిటీ బస్సుకు అద్దాలు లేవు. పట్టాల సందుల్లో నుంచి ఎడా పెడా వాయించేస్తూంది గాలి.

నాకు అర్థంగానిది ఒక్కటే— పెండ్లి చేసుకున్న సంవత్సరానికే విడిపోవాలన్నంత విభేదాలు వాళ్ళిద్దరి మధ్య ఎలా వచ్చాయి? ఎందుకు వచ్చినాయి?

అర్థం కావాలీ అనుకుంటే ఆ చీటీ చూడాలి.

ఊహూఁ. ఇలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనస్సును కలవర పెట్టుకునేదాని కంటే ఆ చీటీ చూసి, అందులో క్లూ దొరికితే మళ్ళీ వాళ్ళను కలిపేటందుకు ఏదైనా ఆలోచించవచ్చు— అవకాశాన్ని విడవగూడదు.

అందుకే — అన్నీ మరిచి జేబులోని కాగితం తీసి దొంగలా మడత విప్పాను.

"ఇది మీకు ఆఖరి అవకాశం.

మనస్సు మార్చుకుంటారా?

నన్ను వదులు కుంటారా?

—శారద."

ఛట్— ఏమిటి ఈవిడగారి ఈ బోడి సందేశం!

చాలా తేలిగ్గా దొరికింది ఇల్లు—ఇక ఆ శేఖరమే రక్షించాలి నన్ను. ఈ గజిబిజి గళ్ళ మడి కట్టుకు సమాధానం అతగాడే చెప్పాలి!

ఇంకా తలుపులు, కిటికీలతో సహా మూసి ఉన్నాయి. కాలింగ్ బెల్ నొక్కాను.

శేఖరాన్ని పెళ్ళిలో చూడటమే. అయినా ఇట్టే గుర్తు పట్టగలననే ధైర్యం నా కున్నది.

తలుపు తీసింది ఒక యువతి. ఇరవై పైనే ఉంటాయి. మెడలో మంగళ సూత్రాలు కొట్టవచ్చినట్లుగా కనబడుతున్నాయి.

తడబడ్డాను. శేఖరం మళ్ళా పెళ్ళి చేసుకున్నాడా?

"శేఖరంగారు ఉన్నారా అండీ!"

"రండి, లోపలకు!" అన్నది పక్కకు జరిగి దారి ఇస్తూ. "అవునూ—మీ పేరు రామంగారూ!"

ఉలిక్కి పడ్డాను. ఆమెకు నేనెలా తెలుసు? ఆశ్చర్యంగా ఆమెనే చూస్తుండగా ఆమే నవ్వి, "నేను మీ మిత్రురాలు శారద భర్తగారి చెల్లెల్ని... మా అన్నయ్య పెళ్ళిలోనే మిమ్మల్ని చూశాను!" అన్నది.

గుండె స్థిరంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది.

లోపలికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను.

"మీ శారద మా ఇంట్లో లేదు!"

"నేను శేఖరంగారి కోసం వచ్చాను!" ఇక అంతకు మించి ఎలా చెప్పాలో అర్థంకాలేదు.

"అయితే మా వదినే మిమ్మల్ని పంపించి ఉండాలి. అవునా!"

కాదని ఎందుకు అనాలి? "అవును" అన్నాను.

"అన్నయ్య ఇంకా నిద్ర లేవలేదు. కాఫీ కలుపుకు వస్తాను. కూర్చోండి" అంటూ వెనుతిరిగింది.

"ఇప్పుడేమీ వద్దండీ. త్రాగే బయల్దేరాను. మీ అన్నయ్యను లేవనీయండి" అన్నాను. కాస్త చొరవ తీసుకుంటున్నట్లుగా, "ఎందుకు ఇలా జరిగిందో మీరు చెప్పగలరా!" అన్నాను.

"మా వదిన చెప్పలేదా?"

"లేదు."

"అయితే నాకూ తెలియదు!"

"అదేమిటి!"

"అన్నయ్య నాకూ ఏమీ చెప్పటం లేదు. నేను నిన్న పొద్దున్నే వచ్చాను. మా వారు ఆఫీసు పని మీద బొంబాయి వెళుతూ నన్ను ఇక్కడ దించి వెళ్ళారు. ఇక్కడకు వస్తే ఇదీ రామాయణం!" అన్నది దిగులుగా ముఖం పెట్టి, నా ముఖంలోకి చూస్తూ.

"ఎవ్వరితోటి రామాయణ, మహా భారతాలు చెబుతున్నావ్?"

శేఖరంలో మార్పేమీ లేదు. చేతిలో సిగరెట్‌తో గదిలోకి పొగల గింగిరాలు వదులుతూ వస్తుండగానే, లేచి నిలబడి "నమస్కారం—నా పేరు—" అన్నాను.

"రామం! నాకు తెలుసు. కూర్చోండి.. ఎప్పుడు వచ్చారు!"

"మూడు రోజులు అయింది. శారద దగ్గరకు నిన్న సాయంత్రం వద్దామనుకుంటుండగా బాలా నగర్‌లో శారదే నాకు కనబడి నన్ను ఆశ్చర్య పరిచింది. అంతేగాదు..." తడబడుతున్నట్లుగా ఆగాను. "నా గుండెని కదిలించే కొన్ని విషయాలు నాకు చెప్పింది. చాలా బాధ పడ్డాను!"

"మీరు దేనికి బాధపడటం!" లోపలకు పీల్చిన పొగను సూటిగా పైకి వదిలాడు.

ఏలా సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు. చుట్టూ అంతా చీకటిగా ఉన్నట్లనిపించింది.

"చెప్పండి!" ఒత్తి పలుకుతూ అన్నాడు శేఖరం.

వాళ్ళిద్దరి మధ్య అంత అగాధం ఏర్పడిందంటే కళ్ళు చెమరుస్తున్నట్లనిపించగా, కను రెప్పలు టపటప లాడిస్తూ, "దురదృష్టవశాత్తూ నేను మనిషిగా పుట్టాను" అన్నాను.

ప్రపంచమంతా సర్వనాశన మవ్వగా, మేంముగ్గురమే దిక్కుతోచని వాళ్ళలా నిశ్శబ్దంగా ఉండి పోయినాం.

"ఓకే. ఫ్రెష్ చేసుకొస్తాను. పది నిముషాలు కూర్చోండి!" అంటూనే లేచి, "అమ్మా, నిర్మలా కాఫీ కలుపు" అన్నాడు.

నేను నోరు విప్పలేదు.

రేడియోలో భక్తి గీతాలు. . .

తలంతా మొద్దు బారిపోయింది. కళ్ళు మూసుకొని శూన్యంలో పిచ్చి గీతాలు గీసుకుంటూ మళ్ళీ శేఖరం కంఠం వినబడేటంత వరకూ అలాగే కూర్చున్నాను.

"ఎలాగూ వచ్చారు కాబట్టి నాకు చిన్న సహాయం చేయాలి!" అన్నాడు కొత్త సిగరెట్టు వెలిగిస్తూ శేఖరం.

ఇద్దర్నీ కలపమంటాడా. . . ఓకే! అంతకంటే కావాల్సిందేం ఉన్నది? హృదయ పూర్వకంగా మధ్యవర్తిత్వం వహిస్తాను!


"చెప్పండి."

లేచి లోపలకు వెళ్ళి చిన్న పెట్టెతో తిరిగి వచ్చాడు. "ఇందులో శారద గొలుసు, ఉంగరం ఉన్నాయి. వీటిని తీసుకువెళ్ళి ఆమె కివ్వాలి!" అన్నాడు, సిగరెట్‌ను యాష్ట్రే మీదకు తీసుకు వచ్చి ఎడంచేతి వ్రేలితో నుసిమీద కొడుతూ.

నీరసంగా కుర్చీలో వెనక్కు జారగిల పడి పోయాను.

"ఈ చీటీని మీ కిమ్మన్నది. సమాధానం కూడా కావాలిట!"

"ఓ.కే!" గూడ లాగేశాడు శేఖరం సిగరెట్టును గబగబా పీలుస్తూ. తరువాత ఉత్తరాన్ని మడత



విప్పి చూసి, నోట్లో నుంచి సిగరెట్టు ఉంచుకునే పొగను వదులుతూ, ఆ కాగితాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి యాష్ట్రేలో వేశాడు.

హతోస్మి! ఇది ఇంకెవ్వరూ కలపలేని దూరమే! ఏడవలేక నవ్వాను.

మామధ్య ఇక మాటలే కరువైనట్లుగా నిశ్శబ్దం తెరలు దాచేసింది. ఏం మాట్లాడాలి? ఏం మాట్లాడకుండా ఉండాలి? అసలు ఇంతకీ ఇలా జరగటానికి కారణం ఏమిటి? ఎలా తెలుసుకోవాలి? ఇద్దరికి ఇద్దరూ ఏమీ చెప్పటం లేదు!

"ఇక నన్ను వెళ్ళమంటారా?"

"మీ రెన్నాళ్ళు ఉంటారీ వూర్లో?" పెట్లో నుంచి మరో సిగరెట్టు తీసి నోట్లో ఉన్నదాంతోటే ముట్టించుకుని, పాతదాన్ని యాష్ట్రేలో నొక్కేశాడు.

"ఈ రోజు ఉదయానే వెళ్ళ వలసింది. రేపొద్దునకు పోస్ట్ పోన్ చేసుకున్నాను!"

"ఐ. సీ!"

"గుంటూరే గదా మీరు ఉండటం!"

"అవునండీ!"

మరల నిశ్శబ్దం.

ఇంతకీ ఇలా జరగటానికి కారణం తెలుసుకోవాలని ఉన్నది. అన్నాను నంగి నంగిగా— 'నీకెందుకు?' అంటే సమాధానం ఏం చెప్పాలా అని ఆలోచిస్తూ.

ఒక్కసారి శేఖరం సూటిగా నా ముఖంలోకి చూచి ఫక్కున నవ్వాడు— నోట్లో నుంచి పొగను నవ్వుతో సమానంగా తెరలు తెరలుగా వదులుతూ

నన్ను అవమానిస్తున్నాడా అనిపించగా ముఖం నల్లబడి పోయింది.

"ఓ.కే. వస్తానన్న" లేచి నిలబడ్డాను.

శేఖరం కూర్చునే ఉన్నాడు.

"శారద మీకేం చెప్పలేదా?"

"చెబితే మిమ్మల్ని అడిగే ప్రసక్తే రాదుగదా!" ముఖానికే గంటు పెట్టుకుంటూ అన్నాను.

శేఖరం మరు క్షణంలోనే సీరియస్ అయ్యాడు. "చాలా సింపుల్. . . నన్ను సిగరెట్లు మానేయమన్నది. . . నావల్ల కాదూ అన్నాను!" గంభీరమయింది కంఠం.

"ఐ సీ!"

శేఖరం లేచి నిలబడ్డాడు. చేయి చాస్తూ "సీ యూ!" అన్నాడు.

నేను బయటకు వచ్చేశాను.

ఆ కారణం విని నేను నవ్వాలో, ఏడవాలో అర్థం గాక రోడ్డు మీద నడుస్తుంటే— భాస్కరం కనబడ్డాడు

భాస్కరం నా చిన్ననాటి స్నేహితుడు. ఇక్కడ చూడవలసిన వాళ్ళలో అతి ముఖ్యుడే అయినా సరైన చిరునామా లేక వదలి వేయ బడ్డవాడు.

వాడిని కలవడం చాలా ఆనందం కలిగించింది.

భుజాల మీద చేతులు వేసుకుని రోడ్డు మీద నడవసాగాం!

● ● ● ●

పదకొండు గంట లవుతుండగా నేను శారద ఇంటి ముందు నిలబడి తలుపు తట్టాను. ఆలస్య మయింది. ఆవిడగారి చేతిలో చివాట్లు తప్పవు.

తలుపు తీసి దారి కడ్డంగా నిలబడింది.

''ఎప్పుడనగా వెళ్ళావు. . .ఎప్పుడు వస్తున్నావు!'' సూటి ప్రశ్న.

''భాస్కరం కనబడ్డాడు!''

''ఎవ రా బోడి—'' చటుక్కున తలెత్తి నావెనక్కు చూసింది.

నేను ఫక్కున నవ్వాను. ''అనదలుచుకున్నది ధైర్యంగా అనక వెనక మనుష్యు లున్నారేమోనని వెతకటం దేనికి?''

''సంతోషించాంలే. లోపలికి రా. సమాధానం ఏమిచ్చారు ఆయనగారు!'' ఆత్రంగా ఉన్నది ఆ కంఠం.

'మువ్విచ్చిన వీటే చించి ముక్కలు చేశాడు' అని అందామనుకొని, మనస్సుకు గాయం పరిచినట్లు అవుతుందని,'' మీ ఇద్దరి మధ్యా మన స్పర్ధలకు కారణమేమిటో చెబితే ఆయనిచ్చిన సమాధానం చెబుతాను '' అన్నాను.

''నేను ఉద్యోగం చేస్తున్నాను—ఆయన వద్దన్నాడు '' అన్నది శారద గొంతు పెద్దది చేసి.'' ఏం? తప్పా?'' అంది

హతోస్మి! నాకు ఇంకా సరైన తీగ దొరకలే దనేది నిజం.

ఏం సమాధానం చెప్పాలో అర్థం కానట్టుగా కప్పువంక చూస్తూ కూర్చున్నాను.

''ఏం చెప్పు.. నేను ఉద్యోగం చేయుటం తప్పా?'' రెట్టించింది.

''మొగుడికి ఇష్టం లేనప్పుడు ఉద్యోగం చేయటం తప్పే అవ్వవచ్చు!''

''అదీ—సరైన దారిలోకి వచ్చావ్, రామం. రా, నాయనా, రా! నేను అడిగిన దానికి సరైన సమాధానం చెప్పావ్!'' అన్నది ఎగతాళిగా నవ్వుతూ.

నేను బిత్తర పోయాను, ఎక్కడ తప్పటడుగు వేశానా అన్నట్లుగా.

''మేం ఇద్దరం భార్యా భర్తలం. అవునా''

''నువ్వే కాదంటుంటేవిగదా మరి!''

''పోనీయ్...మీ దృష్టిలో!''

''ఓ.కే. చెప్పు!''

''నువ్వే మన్నావ్? మొగుడికి ఇష్టం లేక పోతే పెళ్ళాం ఉద్యోగం చేయుటం తప్పే అన్నావ్ కదా!''

''అవును!''

''అయితే భార్యకు ఇష్టం లేకపోతే భర్త సిగరెట్లు త్రాగవచ్చా? ఇందాకటి నా ప్రశ్నకు ఎంత సూటిగా సమాధానం చెప్పావో అంత సూటిగానూ ఈ ప్రశ్నకూ సమాధానం చెప్పాలి!''

నా నోరు పెగల్లేదు . పెద్ద దబ్బనంతో బారెడు తాడు తీసుకుని బరబరా కుట్లు వేసినట్లే అయింది.

మాట్లాడలేక జేబులో నుంచి శేఖరం ఇచ్చిన చిన్న పెట్టె తీసి మంచం మీద పెట్టాను.

పావుగంట తరువాత మా పడుము విశ్వాన్నికి కత్తెర్లు వేస్తున్నట్లుగా శారదే నోరు విప్పింది— ''కనక చిట్టి బాబూ... లే—నా కడుపులో ఆకలి మండిపోతూంది. నీ పిచ్చి పిచ్చి ఆలోచనలతో నన్ను చంపక. భోజనం చేద్దాం పద!''

చేసేదేముంది? లేచాను. ఓడిన వాడెప్పుడూ గెలిచిన వా డి చేతుల్లో బందీనే.


''అదీ, రామం, సంగతి. నేను సిగరెట్లు మానేయండీ అన్నాను. మానలేదు. నా యందు దయ ఉంచి మానేయండీ అన్నాను.. మానలేదు. . . మీ కాళ్ళు పట్టుకుంటాను, మానేయండీ అన్నాను. మానలేదు. మీ కళ్ళముందే తల పగలగొట్టుకుని చస్తాను—మానేయండీ అన్నాను—మానలేదు!''


''ఆవేశ పడబోకు, శారదా!''

''అందుకే ఉద్యోగంలో చేరాను. రెండు వందలు జీతం చాలు నాకు. ఎందుకు నీకు ఉద్యోగం అన్నారు. డబ్బు కావాలీ అన్నాను. ఎందుకు డబ్బా అన్నారు. సగం జీతం మీ సిగరెట్లకు, మిగతా సగం అందుమీద మీకు వచ్చే రోగాలకీనూ ఉన్నాను!''

''శారదా!''

''అవును—ఆయునకు రోగమొస్తే, దానికి వేలకు వేలు డబ్బు కావాల్సివస్తే, నన్ను రోడ్డు మీద








చీరచెంగు పరుచుకుని అడుక్కోమంటావా?''

''ఛ ఛ చాలా అన్యాయంగా ఆలోచిస్తున్నావ్, శారదా. ఎందుకు వస్తుంది అలాంటి పరిస్థితి? అంతా నీ భయం గాని!''

''వస్తే...''

''రాకపోతే...''

''ఆల్‌రైట్. . మానేవోయ్... ఆ డబ్బును మేమే అనుభవిస్తాం!''

అలా అంటున్నప్పుడు శారద కళ్ళు తడి అవ్వడం చూశాను.

అన్నం సహించ లేదు.

• • • •

సాయంత్రం హైదరాబాద్ యాత్రలో ఆఖరి మజిలీ భాస్కరం గదికి వచ్చేసినా శారదకు నేనేమీ సహాయం చేయలేక పోయానే అనే బాధ నన్ను సన్నగా నిలవ నీయలేదు.

ఆ రాత్రికి ఉండకుండా వెళ్ళిపోతున్నందుకు శారద బాధపడ్డా నేను ఉండీ ఆ కుటుంబాన్ని బాగు చేయ గలిగిందేం లేదు గనుక మొండిగా భాస్కరం గదికి వచ్చేశాను.

గుంటూరు వెళ్ళగానే మేస్టారుకి వివరంగా అంతా చెప్పి ఆయన్ని పంపిస్తే, నేను చేయ లేంది ఆయనైనా చేయవచ్చు. అదే తృప్తి నాకు.

పొద్దున్నే కృష్ణలో వెళ్ళటందుకుగాను సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్ళాను. భాస్కరం వేరే చోటకు వెళ్ళాల్సిన పని ఉండటంతో రూమ్‌లోనే ఉండి పోయాడు.

ప్లాట్ ఫారం మీద ఉన్న ట్రెయిన్‌లోని పెట్టె నంబర్ చూసుకుని ఎక్కాను. నా అదృష్టం సింగిల్ సీటర్ వచ్చింది. హాయిగా కూర్చున్నాను.

అప్పుడే న కళ్ళకు ఒక విచిత్ర మయిన దృశ్యం కనబడింది.

నా కళ్ళను నేను నమ్మలేక పోయాను.

శారద, శేఖరం ఇద్దరూ పక్క పక్కన నడుస్తూ ప్లాట్ ఫారం మీదకు వస్తున్నారు.

నా ఆనందానికి అవధులే లేక పోయాయి.

'ఇదేమిటి. . . ఇంత తొందరలో. . .ఎప్పటికీ జరగదేమోనని భయ పడ్డది ఎలా జరిగి పోయింది!' అని ఆశ్చర్యపోయి, 'ఎలాగైనా జరగనీ—చాలా బాగా జరిగింది!' అని సంతృప్తిగా వాళ్ళ వంక చూశాను.

''హల్లో, రామం!'' ఇద్దరూ ఒకేసారి చెయ్యెత్తారు నావంక చూస్తూ.

''వెల్‌కమ్. వెల్‌కమ్‌టు యూ బోత్...థాంక్స్... చాలాచాలా ఆనందం. . .'' మాటలకు పొంతన కుదరక పోయినా నా సంతోషాన్ని వ్యక్తం చేశాను. ''గాడ్ ఈజ్ నాట్ ఓన్లీ గ్రేట్, బట్ గ్రేటెస్ట్!''

''మీరు వచ్చిన సమయంలో మేం ఇద్దరం ఒక అంగీకారానికి రావటం మాకు చాలా ఆనందంగా ఉన్నది. నేను సిగరెట్లు తాగటం మానేశాను!'' అన్నాడు శేఖరం— ఎప్పుడూ సిగరెట్టు ఉండే కుడి చేయి ఎత్తి నావంక చూపిస్తూ.

''నేనూ ఉద్యోగం మానేశాను!'' శారద హాయిగా నవ్వింది.

వాళ్ళ సంతోషం ముందు నా ఆనందం ఇంతై ఇంతింతై పైపైకి ఎగసిపోతూంది.

''మీ ఇద్దరూ సరదాగా గుంటూరు వచ్చేయ కూడదూ!'' అన్నాను ఆనందంగా.

''తప్పకుండా. . . అయితే ఇప్పుడు గాదు. మరోసారి!''

చాలా అదృష్టవంతులు అనుకున్న మా మాస్టారు కాదేమోనని ఈ రెండు రోజులూ కలవర పడ్డాను గాని, అవునని ఈ క్షణం నాకు కొత్త వూపిరి నిచ్చింది.

''హాయ్, శారదా!'' మా పెట్టెలోనే చివరి సీటులో కూర్చున్న ఒక అమ్మాయి తల బయటకు పెట్టి చేయి వూపుతూ పిలిచింది.

''ఒక్క క్షణం!'' అంటూ శారద అటు వెళ్ళింది.

శారద ఆ అమ్మాయి వైపుకు నాలుగడుగులు వేయగానే, ''చూశారండీ, రామంగారూ! నాకు రాత్రే జ్ఞానోదయమయింది... చాలా చిన్న విషయంలో మేం దూరమయి పెద్ద తప్పు చేస్తున్నామా అని పించింది. అందుకే ఆలోచించాను. శారదకు నేను సిగరెట్లు తాగనని మాట ఇచ్చినా— ఆమె ఎదురుగ్గా లేనప్పుడు తాగటంలో నష్టం లేదుగదా. అందులో ఇలాంటి ఒక చిన్న అబద్ధం జీవితం సుఖమయం మవ్వటానికి హేతువవుతున్నప్పుడు—అదినా అన్యాయం కాదనిపించింది. అందుకే కాంప్రమైజ అయ్యాను. ఆఫీసులో ఏం చేసినా అడిగే వాళ్ళు లేరుగదా!'' అన్నాడు నవ్వుతూ శేఖరం.

నా మనస్సు చివుక్కు మన్నది. వారిద్దరి మధ్య కుదిరిన ఒప్పందం— చిల్లి పడ్డ కుండకు గుడ్డ ముక్క అడ్డం పెట్టినట్టే ఉన్నది. .. ఎప్పటికైనా ఓడుబడే. క్షణం క్రితం తేలికయిన మనస్సు మరలా మంచులా గడ్డ కట్టుకు పోయింది.

''కాఫీ త్రాగుదాం. చెప్పొస్తాను!'' అంటూ ఎదురుగ్గా ఉన్న ఎక్స్‌ప్రెస్సువైపుకు నడిచాడు శేఖరం.

శారద వచ్చింది, ''మా శ్రీవారు ఏరీ!'' అంటూ నవ్వుతూ.

శారదను చూస్తుంటే బాధ వేసింది. జాలి వేసింది. కళ్ళార్పకుండా ఆమెనే చూస్తూ ఉండి పోయాను.

''చూడు, రామం! ఆయన మాట మీద నాకు నమ్మకం లేదు. ఈ మగవాళ్ళను నమ్మే దెవ్వరు ఈ ప్రపంచంలో? అందుకే అంతగా సిగరెట్లు త్రాగే ఆయన పూర్తిగా మానేస్తానూ అని మాటంటే నమ్మమంటావా? నేను ఇరవై నాలుగు గంటలూ కాపలా కాస్తానా? ఉహూఁ. అందుకే ఒక హేమింగ్ మెషిన్ కొంటున్నాను. మధ్యాహ్నం పూట గుడ్డలు కుట్టయినా నాలుగు డబ్బులు సంపాదించి దాచి పెడతాను'' అన్నది దృఢంగా.

మొట్ట మొదటి సారిగా జీవితంలో పెళ్ళంటే భయమేసింది. అంతేగాదు— ఆ క్షణంలోనే నన్ను కాళ్ళు పట్టుకుని ఎవ్వరో క్రిందకు జర్రున లాగుతున్నట్టుగా రైలు కదలింది! *